## క్లుప్తంగా

### పెడనలో 'ఫుడ్ సేఫ్టీ' తనిఖీలు

పెడన: పట్టణంలో బిర్యానీ విక్రయిస్తున్న పలు పాయింట్లను మంగళవారం మచిలీపట్నంకు చెందిన ఫుడ్ సేఫ్టీ అధికారి గోపాలరావు తనిఖీలు చేశారు. పట్టణంలోని కేఎం బిర్యాని, బంటుమిల్లి రోడ్డులోని ఎస్ఆర్కే బిర్యాని షాపుల వద్ద తనిఖీలు చేసి ఆ పదార్థాలను పరీక్షల నిమిత్తం పంపించారు. ఆయన వెంట ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరికిషోర్, సచివాలయాల శానిటరీ కార్యదర్శులున్నారు.

### పులిగడ్డలో జంగిల్ క్లియరెన్స్

పులిగడ్డ(అవనిగడ్డ): పులిగడ్డ పంచాయతీ పరిధిలోని పలు రహదారుల పక్కన జంగిల్ క్లియరెన్స్ చేయించారు. ప్రధాన రోడ్లతో పాటు పలు రహదారుల పక్కన పిచ్చిమొక్కలు, ముళ్ల చెట్లు పెరిగిపోవడంతో ప్రజలు, వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్ రెండు రోజుల నుంచి జేసీబీతో చెట్ల తొలగింపు చర్యలు చేపట్టారు. సర్పంచ్‌తో పాటు ఈవో బి.అనిత, ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు పనులను పర్యవేక్షించారు.

### పౌష్టికాహారంతో ఆరోగ్యం

కృత్తివెన్ను: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ అధికారులన్నారు. ఈ నెల 1 నుంచి 7వ తేదీ వరకు జాతీయ పౌష్టికాహార వారోత్సవాలు జరుగుతున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా మంగళవారం మాట్లాం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంతో కలిగి లాభాలను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఝాన్సీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పార్వతి, పెద్దేశ్వరి, తిరుపతమ్మ, విజయదుర్గ, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

### వరి పంటలో జింకు లోపం

పెడన: నడుపూరు, కొంకేపూడి గ్రామాల పరిధిలో వరి పంటలో జింకు లోపం కనిపిస్తోందని, జాగ్రత్తలు తీసుకుంటే అధిగమించవచ్చని పెడన ఏవో సజ్జా జెన్నీ అన్నారు. మంగళవారం ఆయా గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పంట పొలాలను పరిశీలించి రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు ఇచ్చారు. రెండు గ్రాముల జింకు సల్ఫేట్‌ను లీటరు నీటిలో బాగా కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఆయా గ్రామాల వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

### వృద్ధుడి ప్రాణాలు కాపాడిన పీహెచ్‌సీ వైద్యుడు



బంటుమిల్లి: స్థానిక ఆర్టీసీ బస్టాండులో బస్సు దిగి స్వగ్రామం వెళ్లే క్రమంలో కళ్లు తిరిగి పడిపోయిన 70 ఏళ్ల వృద్ధుడిని స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు విన్నకోట పవన్‌కుమార్ ప్రాథమిక వైద్యం అందించి ప్రాణాలు కాపాడిన సంఘటన మంగళవారం సాయంత్రం స్థానికంగా చోటు చేసుకుంది. ములపర్రు గ్రామానికి చెందిన బత్తుల సుబ్బారావు పెడన వెళ్లి వైద్యం చేయించుకుని మచిలీపట్నం-బంటుమిల్లి బస్సు దిగి స్వగ్రామం వెళ్లే ప్రయత్నంలో ఉన్నాడు. అప్పటికే అనారోగ్యంతో ఉండటం, ఉదయం నుంచి భోజనం చేయని సుబ్బారావు నీరసించి కళ్లు తిరిగి బస్‌స్టాండ్ ఆవరణలో పడిపోయాడు. అదే సమయములో పీహెచ్‌సీ సిబ్బందిని బస్సు ఎక్కించేందుకు వైద్యాధికారి వి. పవన్ బస్‌స్టాండుకు వచ్చారు. తోటి ప్రయాణికులు సుబ్బారావు విషయం పవన్ దృష్టికి తెచ్చారు. వృద్ధుడి పరిస్థితి విషమంగా ఉండటంతో పవన్ ప్రాథమిక వైద్యం అందించి హార్ట్ కంప్లైంట్ ఉందని వెంటనే మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. వెంటనే 108 సిబ్బంది వచ్చి వృద్ధుడు సుబ్బారావును మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి వారికి అప్పగించారు.

### 47 మందికి ప్రశంసాపత్రాలు

నాగాయలంక: స్థానిక పంచాయతీ కార్యాలయం సెంటర్‌లో రెడ్‌క్రాస్ చైర్మన్ భోగాది శివ విష్ణువర్ధన్, డీసీ చైర్మన్ బండ్రెడ్డి నాగ మల్లికార్జునరావు (చినబాబు), బండ్రెడ్డి మల్లికార్జున్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుక జరిపారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ రక్త దాతలు, సామాజిక సేవకులు 47మందికి జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ నుంచి ప్రశంసా పత్రాలు అందించారు. రెడ్‌క్రాస్ సొసైటీ స్థానిక సబ్ బ్రాంచ్ నిర్వహించిన శిబిరంలో 69మంది రక్తదానం చేశారు. స్థానిక తహసీల్దార్ సీహెచ్‌వీ ఆంజనేయప్రసాద్, ఎస్‌ఐ కె.రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

### ఆటో కార్మికులకు ఉపాధి చూపించాలి

చల్లపల్లి: ఉచిత బస్సు నేపథ్యంలో ఆటో కార్మికులకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ కృష్ణాజిల్లా ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆటో కార్మికులు రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ప్రధాన సెంటర్లో మానవహారంగా ఏర్పడ్డారు. కృష్ణా జిల్లా ఆటోవర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మల్రాపు పోలినాయుడు జిల్లాలో ప్రత్యక్షంగా గానీ... పరోక్షంగా గానీ... 50 వేల కుటుంబాలు ఆటోలపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఆగస్టు 15వ తేదీ నుంచి ప్రభుత్వ ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు వల్ల ఆటో కార్మికులు పూర్తిగా ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి నేతలు నెరవేర్చాలన్నారు.



చల్లపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న సింహాద్రి వికాస్



నాగాయలంకలో రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న పార్టీ శ్రేణులు



బంటుమిల్లి సచివాలయం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు



సూరపనేనిపాలెంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



కృత్తివెన్ను మండలం గాంధీనగరంలో..

# వైఎస్సార్ జ్ఞాపకాలు సజీవం

వైఎస్సార్ అంటే ఓ నమ్మకం, భరోసా.. ఆప్యాయత, మానవత్వానికి నిలువెత్తురూపం. ఆరోగ్య శ్రీ, 108, ఫీజు రీయింబర్స్‌మెంట్, చిన్నపిల్లలకు ఉచితంగా గుండె ఆపరేషన్లు ఇలా ఎన్నో అద్భుత పథకాలు ప్రజల జీవితాల్ని నిలబెట్టాయి. ఇతర పార్టీల నేతల మదిని సైతం చూరగొన్న మనసున్న పాలకుడు రాజన్న. తక్కువ సమయంలో అనేక గొప్ప పనులు చేసి.. భౌతికంగా మనల్ని వీడి వెళ్లినా ఆయన జ్ఞాపకాలు మాత్రం సజీవంగా ఉన్నాయి. అవి నిత్యం మన వెంటే ఉంటాయి.

- సంక్షేమ పాలనలో వైఎస్సార్‌ది నూతన ఒరవడి
- పేదలకు మెరుగైన విద్య, వైద్యం అందించారు
- వాడవాడలా వైఎస్సార్ వర్ధంతి



అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు ఇచ్చి పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని మంగళవారం అవనిగడ్డ, మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల్లో వాడ వాడలా నిర్వహించారు. ప్రజా సంక్షేమానికి అనేక పథకాలు అమలుచేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి తన పాలనలో నూతన ఒరవడి సృష్టించారని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కొనియాడారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద మంగళవారం వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. పార్టీ కార్యాలయం వద్ద, వంతెన సెంటర్‌లో వైఎస్ విగ్రహానికి సింహాద్రి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, ఎస్సీసెల్ నాయకులు నలుకుర్తి రమేష్, గుర్రం బసవయ్య, నలుకుర్తి పృథ్వీరాజ్, ప్రచార విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి గాజుల జైగోపాల్, పులిగడ్డ, దక్షిణ చిరువోలులంక సర్పంచ్‌లు దాసరి విజయకుమార్, సనకా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

**చల్లపల్లిలో..**

చల్లపల్లి: స్థానిక దళితవాడ వద్ద వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తనయుడు సింహాద్రి వికాస్ మండల నేతలు, కార్యకర్తలతో కలిసి పూల మాలలు వేశారు. అనంతరం చల్లపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చల్లపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కల్యాణి, సర్పంచులు గొరిపర్తి సురేష్(నడకుదురు), మాతంగి రమ్య(పురిటిగడ్డ), పార్టీ దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్లూరి శామ్యూల్, పార్టీ ఆర్టీఐ విభాగం జిల్లా అధ్యక్షుడు పానమాల నాగరాజు, మైనార్టీ సెల్ అవనిగడ్డ నియోజకవర్గ కన్వీనర్ అబ్దుల్ అర్షద్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శీరం వెంకటసత్యనారాయణ, మండల మహిళా కన్వీనర్ బొందలపాటి లక్ష్మి, ఏపీ ఫుడ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మేరుగు ఝాన్సీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**నాగాయలంకలో..**

నాగాయలంక: నాగాయలంక సాయిబాబా గుడి సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, పార్టీ మండల అధ్యక్షుడు భోగాది వెంకట శేషగిరి రావు, వైస్ ఎంపీపీ మోకా నాగప్రసాద్, మాజీ సర్పంచ్‌లు దాసి జీవరత్నం, నంద్యాల వెంకట కోటేశ్వరరావు, డీసీ మాజీ చైర్మన్ బీసాబత్తుని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. గ్రామంలోని వృద్ధుల ఆశ్రమానికి వెళ్లి ఆశ్రమ వాసులకు అవసరమైన ఆఫ్ హెచ్‌బీ వాటర్ మోటార్‌ను వితరణ చేశారు. ఆశ్రమంలోని వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేసి, రొట్టెలను అందజేశారు. నిర్వాహకుడు తలశిల లీలా మనోహర్‌ను అభినందించారు. జిల్లా బూత్ కమిటీల పార్టీ ఇన్‌చార్జి మద్ది వెంకట నారాయణ(చిన్నా), వైఎస్సార్ సీపీ నాయకులు బండ్రెడ్డి శ్రీనివాసరావు, తోట కృష్ణ, తానంకి వేణుబాబు, ఎం.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

**పేదల ఆరాధ్యదైవం**

బంటుమిల్లి: పేద ప్రజల ఆరాధ్యదైవం వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో స్థానిక సచివాలయం వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల నాగేశ్వరరావు, ఎంపీటీసీలు ఎండి. కమాల్‌బాషా, ఆలీం, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ పి. బాబూరావు, పార్టీ అనుబంధ శాఖల కన్వీనర్లు, నాయకులు పాము పుష్ప, ముక్కోల్లు మురళి, జొన్నలగడ్డ పాండురంగారావు, దొడ్డాక సాయిబాబు, గొరిశెట్టి నాని తదితరులు పాల్గొన్నారు. జయపురం సెంటర్లో వైఎస్సార్ విగ్రహానికి మండల పార్టీ ఉపాధ్యక్షుడు పల్లికొండ శివ ఆధ్వర్యంలో కార్యకర్తలు, అభిమానులు పూల దండలు వేసి నివాళులు అర్పించారు. కంచడం గ్రామంలోని వైఎస్సార్, గాంధీ విగ్రహాలకు ఎంపీటీసీ పాపాని భగవాన్ ఆధ్వర్యంలో కార్యకర్తలు, అభిమానులు పూలదండలు వేశారు. కార్యక్రమంలో పాల కేంద్రం అధ్యక్షుడు పాపాని ప్రసాదు పాల్గొన్నారు.

**కృత్తివెన్నులో..**

కృత్తివెన్ను: మండలంలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్ వర్ధంతి జరిగింది. నేతలు వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**వృద్ధులు, వికలాంగులకు పండ్ల పంపిణీ**

మచిలీపట్నంటౌన్: నగరంలోని స్నేహాలయం వృద్ధాశ్రమంలో మంగళవారం వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా పండ్లు పంచారు. వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా కోశాధికారి బందెల థామస్ నోబుల్, ఇతర నేతలు పాల్గొన్నారు.

మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవి ప్రధాన సెంటర్‌లో జరిగిన వర్ధంతి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉత్తరచిరువోలులంకలో పీఏసీఎస్ మాజీ చైర్ పర్సన్ రెడ్డొతు వెంకటరమణ, వెంకటాపురంలో గ్రామ పార్టీ కన్వీనర్ పిండి వెంకటేశ్వరావు, అడపావారిపాలెంలో గ్రామపార్టీ కన్వీనర్ పండలనేని శివప్రసాద్ ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మోపిదేవిలో మండల పార్టీ కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు, మండల బీసీ కన్వీనర్ రాజులపాటి నాగేశ్వరావు, ఎస్సీసెల్ మండల కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు, జిల్లా కార్యదర్శి మోర్ల శ్రీనివాసరావు, పార్టీ నాయకులు బండారు సూరిబాబు, తలపుల సుధాకర్, లింగం జగదీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

**139మంది రక్తదానం**

నాగాయలంక: ఎంపీపీ భోగాది రాఘవరాణి కుమారుడు భోగాది పృథ్వీ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యాన నిర్వహించిన శిబిరంలో 139మంది రక్తదానం చేసి రాజశేఖరరెడ్డిపై అభిమానం చాటుకున్నారు. స్థానిక కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన ఈ శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రారంభించారు. మచిలీపట్నం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి స్వచ్ఛంద రక్తదాన క్యాంప్ సిబ్బంది రక్తాన్ని సేకరించారు. భోగాది పృథ్వీ, పార్టీ మండల అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు, వైస్ ఎంపీపీ మోకా నాగప్రసాద్, జిల్లా బూత్ కమిటీల ఇన్‌చార్జి మద్ది చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

కొడాలి(ఘంటసాల): ఘంటసాల మండలం కొడాలి, శ్రీకాకుళం, సూరపనేనిపాలెం, తెలుగురావుపాలెం, గోగినేనిపాలెం గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాల వద్ద నేతలు నివాళులర్పించారు. సింహాద్రి వికాస్, జెడ్పీటీసీ తుమ్మల మురళీ కృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు వేమూరి వెంకట్రావు, సచివాలయాల మండల కన్వీనర్ వేమూరి ప్రవీణ్, తెలుగురావుపాలెం, చిట్టూర్పు సర్పంచులు రాచూరి ప్రసాద్‌బాబు, గూడపాటి వెంకటేశ్వరరావు, నేతలు పాల్గొన్నారు.

**కోడూరులో..**

కోడూరు: స్థానిక గంగానమ్మ ఆలయ సమీపంలోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి, ప్రధాన సెంటర్‌లో వైఎస్సార్ చిత్రపటానికి జెడ్పీటీసీ యాదవరెడ్డి సత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బడే హేమ గంగాధర్, ఎస్సీసెల్ నియోజకవర్గ కన్వీనర్ వెన్నా ప్రసాద్, బీసీ సెల్ మండల కన్వీనర్ చేబోయిన కృష్ణారావు, మత్స్యకార సంఘం నేత చిలకలపూడి ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: వైఎస్సార్ సీపీ గూడూరు మండల అధ్యక్షుడు సమ్మెట జయవర్ధన్ ఆధ్వర్యంలో గూడూరు సెంటరులో రాజన్న చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంచారు. మల్లవోలులో మెట్ల రఘు ఆధ్వర్యాన కుమ్మరిపాలెంలోని వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

## మనసున్న మహానేత వైఎస్సార్



మచిలీపట్నం కోర్టు సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న పేర్ని కిట్టు, నేతలు



బందరు పంబలగూడెం సెంటర్‌లో ..

మచిలీపట్నంటౌన్: మనసున్న మహానేత వైఎస్సార్ అని వైఎస్సార్ సీపీ బందరు కన్వీనర్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. ఆయన ఆధ్వర్యంలో పలుచోట్ల వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. రామానాయుడుపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో, జిల్లా కోర్టు సెంటర్, నాగపోతరావు సెంటర్, ఓగిసుపేటలలో రాజన్న విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఓగిసుపేటలో ఉన్న బీఆర్ అంబేడ్కర్, మాజీ మంత్రి పేర్ని కృష్ణమూర్తి విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ కార్యాలయం నుంచి నగరంలోని ప్రధాన రహదారుల్లో పార్టీ కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్లు గాడెల్లి డేవిడ్ శామ్యూల్, షేక్ అచ్చెబా, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి గణేశన రమేష్‌బాబు, నగర అధ్యక్షుడు మేకల సుబ్బన్న, నగర ఉపాధ్యక్షులు కొలుసు హరిబాబు, గూడవల్లి నాగరాజు, కాగిత జవహర్‌లాల్ నెహ్రూ, తిరుమలశెట్టి వరప్రసాద్, రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జక్కుల ఆనందబాబు (జానీ), వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు జన్ను రాఘవరావు, మట్టా మోహన నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు. ఒకటో డివిజన్ హౌసింగ్‌బోర్డులో, ఆనందపేటలో కార్పొరేటర్ జోగి చిరంజీవి, నాయకులు వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పంబలగూడెం సెంటర్లో కార్పొరేటర్ పల్లి శేఖర్, 50వ డివిజన్ ఇన్‌ఛార్జ్ మరీదు నాగరాజు, 30 డివిజన్లో ఆ డివిజన్ ఇన్‌చార్జి మిరియాల రాంబాబు, తదితరులు నివాళులర్పించారు.

## చిరస్మరణీయుడు రాజశేఖరుడు



పెడన వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఉప్పాల రాము, నేతలు

పెడన: చిరస్మరణీయుడు రాజశేఖరుడు అని వైఎస్సార్ సీపీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము అన్నారు. పెడన వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి, పట్టణంలో పలు ప్రాంతాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బంటుమిల్లి రోడ్డు సెంటరు, మచిలీపట్నం రోడ్డులోని భారీ విగ్రహానికి, 16వ వార్డులో, తోటమూల సెంటరులో విగ్రహాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఆయా మండలాల నేతలు పిన్నింటి మహేష్, సమ్మెట జయవర్ధన్, ముత్యాల నాగేశ్వరరావు, భూపతిరాజు, ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్, జడ్పీటీసీలు వేముల సురేష్‌రంగబాబు, మైలా రత్నకుమారి, పార్టీ నాయకులు బండారు మల్లికార్జునరావు, కొండవీటి నాగబాబు, గరికపాటి రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న నేతలు



మోపిదేవిలో ..




నాగాయలంకలో రక్తదాన శిబిరం



కోడూరులో నివాళులర్పిస్తున్న నేతలు



గూడూరు సెంటరులో ..

**విఘ్నాధిపతికి ప్రత్యేక పూజలు**

మచిలీపట్నంటౌన్: చవితి మహోత్సవాల్లో భాగంగా నగరంలోని రైతు బజార్లో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి పందిరి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను రైతుబజార్ ఎస్టేట్ అధికారి లంకే బలి చక్రవర్తి పర్యవేక్షించారు. మూడు స్తంభాల సెంటర్లోని విజయ గణపతి స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

పెడన: పెడన చోడుదిక్కుల వీధిలో ఏర్పాటు చేసిన పందిరి వద్ద అన్నసమారాధన జరిగింది అనంతరం లడ్డును లాటరీ ద్వారా అందజేశారు. గూడూరు రోడ్డులోని బ్రహ్మ ఆటో స్టాండ్ వద్ద ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

**సంక్షేమ బోర్డును ఏర్పాటుచేయండి**

చల్లపల్లి: రవాణా రంగంలో ఉన్న కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆటో వర్కర్స్ యూనియన్, ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ కృష్ణాజిల్లా కార్యదర్శి మల్రాపు పోలినాయుడు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక బస్‌స్టాండ్ సెంటర్‌లోని ఆటో స్టాండు వద్ద మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం ఆధ్వర్యంలో సంక్షేమ బోర్డు ఏర్పాటుచేసి ప్రతి కార్మికుడి నుంచి కొంత మొత్తం రుసుం కట్టించుకుని అంతే మొత్తాన్ని ప్రభుత్వం కూడా జమ చేసి సంక్షేమ నిధిని ఏర్పాటుచేయాలని కోరారు. ఇప్పటికే కేరళ, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో సంక్షేమ బోర్డు అమల్లో ఉండటంతో ఆయా ప్రాంతాల్లోని రవాణా రంగంలో ఉన్న కార్మికులు భరోసాగా ముందుకు సాగుతున్నారన్నారు.

**చేనేతలకిచ్చిన హామీలు అమలుచేయండి**

ఘంటసాల: చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేసి ఆదుకోవాలని పౌర హక్కుల సంఘం కృష్ణాజిల్లా కమిటీ సభ్యుడు జక్కా కేశవరావు మంగళవారం అన్నారు. గోటకంలో కేశవరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని చేనేత కార్మికులందరికీ 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తామని, గతంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన దానికంటే వెయ్యి రూపాయలు ఇస్తామన్నారని అంటే చేనేతలకు ఇస్తానని చెప్పిన రూ.25 వేలు పంపిణీ కూడా వెంటనే చిత్తశుద్ధితో అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులకు ఇళ్ల స్థలాలు కూడా మంజూరు చేయాలని కేశవరావు కూటమి ప్రభుత్వాన్ని కోరారు.

## సంక్షిప్త వార్తలు

**సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించండి**

గూడూరు: సీజనల్ వ్యాధులపై ప్రజలల్లో చైతన్యం తీసుకురావాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ పామర్తి మురళి ఆశాకార్యకర్తలను సూచించారు. ఆశా డేను పురస్కరించుకుని మల్లవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు తరుణ్‌శంకర్, రూపాశ్రీ, ఎంపీహెచ్‌ఓ వీరయ్య, హెచ్‌వి సరళకుమారి, అనురాధ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

**స్వామిత్వ సర్వేతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం**

చిలకలపూడి(మచిలీపట్నం): స్వామిత్వ సర్వేతో గ్రామాల్లోని భూసమస్యలకు పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ డీకేబాలాజీ అన్నారు. మంగళవారం నగరంలోని రెవెన్యూ కల్యాణ మండపంలో జిల్లా పంచాయతీ ఆధ్వర్యంలో స్వామిత్వ సర్వే పై రెవెన్యూ, సర్వేయర్లు, సచివాలయ సిబ్బందికి ఒకరోజు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, జిల్లా పంచాయతీ అధికారి జె.అరుణ తదితరులు పాల్గొన్నారు.

**భార్య కనిపించడం లేదని ఫిర్యాదు**

పెడన: భార్య కనిపించడం లేదని భర్త పెడన పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. బల్లిపర్రు గ్రామానికి చెందిన గరికిముక్కు వెంకటేశ్వరరావు బల్లిపర్రులో ఎలక్ట్రికల్ వెల్డింగ్ వర్క్ చేస్తుంటాడు. అతని భార్య నందిని బల్లిపర్రులో కలంకారి పనులకు వెళ్తుంటుంది. కుటుంబకలహాల నేపథ్యంలో బంటుమిల్లి మండలం ఆర్తమూరులో అద్దె ఇంటిలో ఉంటూ నిత్యం బల్లిపర్రుకు పనులపై వస్తుంటారు. ఈ క్రమంలో గత నెల 30న తనభార్య పుట్టింటికి అని చెప్పి మేనకోడలను వెంటబెట్టుకుని వెళ్లింది. నందిని మడకలో బస్సు దిగిపోగా మేనకోడలు మచిలీపట్నం కాలేజీకి వెళ్లిపోయింది. ఆ రోజు రాత్రి వినాయకుని నిమజ్జనం అని ఉండిపోయిందనుకున్నారు. మరుసటి రోజు కూడా ఇంటికి రాకపోవడంతో అత్తగారికి ఫోన్ చేస్తే ఇంటి వద్ద లేదని సమాధానం ఇవ్వడంతో అన్ని చోట్ల వెదికినా ఫలితం లేకపోయింది. పెడన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**సామూహిక అనఘాష్టమి వ్రతం**

నాగాయలంక: గ్రామంలోని ప్రసన్నగణపతి దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న 68వ వార్షిక వినాయక నవరాత్రి మహోత్సవాల పందిరిలో 7వ రోజు మంగళవారం మండల దత్తభక్తబృందం సౌజన్యంతో సామూహిక అనఘాష్టమీ వ్రతం భక్తిశ్రద్ధలతో జరిగింది. శనగపల్లి వెంకట్రావు బ్రహ్మత్వంలో వేదికపై ప్రధాన కలశ పీఠం వద్ద జరిగిన పూజలో చిట్టా వెంకట శేఖర్ రావు-శ్రీలక్ష్మి దంపతులు పీటలపై కూర్చున్నారు. సామూహిక వ్రత పూజలో 60మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. చుండూరు సత్యనారాయణ, చిట్టా రామలింగేశ్వరరావు, చిట్టా వాణి, పొన్నూరు దిలీప్ తదితర భక్త బృందం ప్రతినిధులు పర్యవేక్షించారు. మధ్యాహ్నం భాగవతారిణి హరికథాగానం జరిగింది.

**పాఠశాలను సందర్శించిన ఎస్ఎస్ఏ అడిషనల్ కో ఆర్డినేటర్**

బంటుమిల్లి: అర్తమూరు పంచాయతీ శివారు నాచుగుంట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సర్వశిక్ష అభియాన్ అడిషనల్ కో ఆర్డినేటర్ ఆర్.కుమిదినిసింగ్ మంగళవారం సందర్శించారు. పాఠశాలకు మనబడి-మన భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా నిర్మాణం చేపట్టిన నూతన భవనం శ్లాబు వరకు వచ్చి నిధులు లేక నిలిచిపోయింది. పాఠశాలను సందర్శించిన ఏపీడీకి వినతిపత్రం ఇచ్చారు. దీనిపై ఆమె స్పందించి పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాదుతో మాట్లాడటంతో ఆయన డక్కన్ ఫిన్ కెమికల్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ద్వారా సీఎస్ఆర్ నిధుల నుంచి 300 కట్టల సిమెంటు మంజూరు చేయించారు. మిగిలిన పనులు పూర్తి చేసేందుకు కావలసిన నిధులు మంజూరు చేసి పాఠశాల భవనం పూర్తి చేయించాలని గ్రామస్తులు వినతి పత్రంలో కోరారు. ప్రస్తుతం పాఠశాల గ్రామస్తులు రేకులతో నిర్మించుకున్న కమ్యూనిటీ హాలులో కొనసాగుతోంది. కార్యక్రమంలో ఎంఈఓలు డాక్టరు ముబీన్‌బాను, ఎ. వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### నిమజ్జనానికి తరలివెళ్లిన గణనాథులు

మోపిదేవి: వినాయక చవితి సందర్భంగా మోపిదేవి బస్‌స్టాండ్ వెనుక వీధిలో ఏర్పాటు చేసిన గణనాథుడిని మోపిదేవివార్పు వద్ద కృష్ణానదిలో మంగళవారం నిమజ్జనం చేశారు. ప్రత్యేక వాహనంపై మేళతాళాలు, డప్పుకళాకారుల సందడితో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

బంటుమిల్లి: స్థానిక ఆర్టీసీ బస్‌స్టాండ్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాన్ని మంగళవారం యువకుల కేరింతలు, డీజే సౌండ్ పాటలతో గ్రామోత్సవం అట్టహాసంగా నిర్వహించి బంటుమిల్లి ప్రధాన కాలువలో నిమజ్జనం చేశారు.

### కారుణ్య నియామక పత్రం అందజేత

కోనేరుసెంటర్: మచిలీపట్నం ట్రాఫిక్ ఎస్సైగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మరణించిన బండారు గంగరాజు కుమారుడు శశాంకకు ఎస్పీ గంగాధరరావు మంగళవారం కారుణ్యనియామకం కింద ఉద్యోగఅవకాశం కల్పిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. శశాంకను జిల్లా ఎస్పీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా నియమించినట్లు ఆయన తెలిపారు.